సాక్షి
రాజన్న సిరిసిల్ల
శనివారం । 2 । సెప్టెంబర్ । 2023

భిక్షాటనతో నిరసన

సిరిసిల్లటౌన్: రెండో ఏఎన్ఎంలు శుక్రవారం సిరిసిల్లలో భిక్షాటన చేస్తూ ప్రభుత్వ తీరుపై నిరసన తెలిపారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపడుతున్న రిలేదీక్షలు శుక్రవారం నాటికి పదిహేనో రోజుకు చేరాయి. వారు మాట్లడుతూ పదిహేనేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించకుండా నోటిఫికేషన్ ఇవ్వడాన్ని తప్పుబట్టారు. సరోజ, కరుణశ్రీ, మధురిమ, పద్మ పాల్గొన్నారు.



న్యూస్‌రీల్

రైతుల సంక్షేమమే సహకార లక్ష్యం



చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రాథమిక సహకార సంఘం పనిచేస్తుందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు పేర్కొన్నారు. సహకార సంఘంలో శుక్రవారం తొమ్మిది మంది రైతులకు రూ.52 లక్షల రుణాల చెక్కులను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ రైతులు ఆర్థిక స్వావలంబన సాధించాలంటే వ్యవసాయంతోపాటు అనుబంధ రంగాలు డెయిరీ, గొర్రెలు, పట్టుపురుగులు, కోళ్లపెంపకం వంటి వాటిపై దృష్టి సారించాలన్నారు. రుణాల మంజూరుకు కృషిచేసిన టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఏఎంసీ చైర్మన్ ఎలుసాని మోహన్‌కుమార్, వైస్‌చైర్మన్ జంగిటి సత్తయ్య, డైరెక్టర్లు వెంకట నర్సింహారెడ్డి, ప్రభాకర్‌రావు, ప్రభాకర్‌రెడ్డి, సతీశ్, బండారి బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి



వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

ముస్తాబాద్(సిరిసిల్ల): సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తుమ్మ రాజేందర్ డిమాండ్ చేశారు. మండల వనరుల కేంద్రం ఎదుట ఎస్ఎస్ఏ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి శుక్రవారం భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు తుమ్మ రాజేందర్ మాట్లాడుతూ ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు ఎస్ఎస్ఏ ఉద్యోగులకు పేస్కేల్ వర్తింపజేయాలని కోరారు. ఉద్యోగులు రమాదేవి, రాజు, పర్శరాములు, దేవరాజు, స్రవంతి, బాలమణి, సాయికుమార్ పాల్గొన్నారు.

రెండు లక్షల రుణాలు మాఫీ చేస్తాం



మరిమడ్లలో ప్రచారం చేస్తున్న శ్రీనివాస్

కోనరావుపేట(వేములవాడ): కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ.2లక్షలలోపు పంటరుణాలు మాఫీ చేస్తామని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. కోనరావుపేట మండలం మరిమడ్లలో శుక్రవారం గడప గడపకు కాంగ్రెస్ నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ కాంగ్రెస్ హయాంలో చేసిన అభివృద్ధి పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో చేసినట్లు ఒకేసారి రూ.2 లక్షల రుణమాఫీ, గ్యాస్ సిలిండర్ రూ.500లకే అందిస్తామని తెలిపారు. ఎంసీసీ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్‌పాషా, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శులు తాళ్లపెల్లి ప్రభాకర్, కర్రోల్ల భాస్కర్, నాయిని ప్రభాకర్‌రెడ్డి, పుల్కం మల్లేశం, సింగం నారాయణ, పెంతల శ్రీనివాస్, అజీమ్, కడకుంట్ల శంకర్, తిరుపతి, రమేశ్, సాగర్, మహేందర్, బాబు, నారాయణ పాల్గొన్నారు.

మట్టి గణపతిని ప్రతిష్ఠిద్దాం



విద్యార్థులను అభినందిస్తున్న విద్యాధికారి

సిరిసిల్లఎడ్యుకేషన్: కాలుష్యాన్ని నియంత్రించి పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎన్‌జీసీ ప్రాజెక్టు ఆఫీసర్ బి.విద్యాసాగర్ పేర్కొన్నారు. సిరిసిల్లలోని వెంకంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు తయారు చేస్తున్న మట్టి గణపతి విగ్రహాలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. డీఈవో రమేశ్‌కుమార్ మట్టి గణపతి ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య, హెచ్ఎం బుస్సా లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆగిన మానేరు మణిహారం

- ముందుకుసాగని మానేరుతీరం రోడ్డు పనులు
- ఆక్రమణలు వదిలి.. మానేరును ముంచి
- మట్టిపనులతోనే సరిపెట్టిన కాంట్రాక్టర్
- రూ.22 కోట్ల పనులకు ఏడాదిగా గ్రహణం



సిరిసిల్లలోని మానేరువాగు వెంబడి మణిహారంలా నిర్మించాలని భావించిన రోడ్డు ఏడాదిగా నిలిచిపోయింది. సిరిసిల్ల విద్యానగర్ వంతెన నుంచి సాయినగర్‌లోని అయ్యప్ప ఆలయం వరకు మూడు కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.22కోట్లు మంజూరు చేసింది. ఆ నిధులతో చేపట్టిన ఫార్మేషన్ (మట్టి రోడ్డు) పనులు చేసి వదిలేశారు. ఆ మట్టి రోడ్డు ఇటీవల కోతకు గురై చెత్తాచెదారంతో మిగిలిపోయింది.



సిరిసిల్ల మానేరు వంతెన వద్ద రోడ్డు నిర్మించే ప్రాంతం



సుభాష్‌నగర్‌లో కోతకు గురైన రోడ్డు

సిరిసిల్ల: సిరిసిల్ల మానేరుతీరాన్ని మరింత అందంగా తీర్చిదిద్దేందుకు చేపట్టిన మానేరు మణిహారం పనులు ఏడాదిగా నిలిచిపోయాయి. 2019లోనే రూ.22 కోట్లు మంజూరుకాగా.. మట్టిపనులు చేసిన కాంట్రాక్టర్ ఇక ముందుకు పోవడం లేదు. ఈ రోడ్డు వెంబడి వాకింగ్‌ట్రాక్ ఏర్పాటు కానుంది. ఈ పనులు పూర్తయితే పట్టణవాసులకు ఆహ్లాదంతోపాటు ట్రాఫిక్ తిప్పలు తీరేవి. కానీ ఏడాదిగా పనులు ముందుకుసాగడం లేదు.

మంత్రి కేటీఆర్ ప్రతిపాదించిన రోడ్డు

సిరిసిల్ల ఎమ్మెల్యే, రాష్ట్ర ఐటీ, మున్సిపల్, పరిశ్రమలశాఖ మంత్రి కె.తారక రామారావు ఏడేళ్ల కిందట మానేరు తీరం వెంబడి రోడ్డు నిర్మించాలని ప్రతిపాదించారు. మానేరువాగులో చెక్‌డ్యామ్ తోపాటు కొత్తగా వాకింగ్‌ట్రాక్‌తో కూడిన రోడ్డును ప్రతిపాదించారు. ఈ రోడ్డు నిర్మాణానికి 2019లోనే రూ.22 కోట్లు మంజూరు చేయించారు.

ఆగిన పనులు

రెండేళ్ల కిందట జిల్లా కేంద్రంలోని విద్యానగర్ మానేరు వంతెన నుంచి బతుకమ్మఘాట్, సుభాష్‌నగర్, నెహ్రూనగర్, సాయినగర్ మీదుగా అయ్యప్ప ఆలయం వరకు రోడ్డును ఫార్మేషన్ చేశారు. ఆరు నెలలపాటు పనులు చేపట్టిన ఇరిగేషన్‌శాఖ అధికారులు మధ్యలోనే నిలిపివేశారు. ఈ రోడ్డు పూర్తయితే మానేరు వంతెన నుంచి కామారెడ్డి వైపు పట్టణంలోకి వెళ్లకుండానే నేరుగా వాహనదారులు వెళ్లే వీలుంటుంది. అటు నుంచి ఇటు.. ఇటు నుంచి అటు రాకపోకలు పెరిగి పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీరుతుంది. కానీ క్షేత్రస్థాయిలో పనులు ఏడాదిగా నిలిచిపోయాయి.

కబ్జాలు తొలగించకుండానే..

వాస్తవానికి మానేరువాగు వెంబడి కబ్జాలను తొలగించకుండానే రోడ్డు ఫార్మేషన్ చేశారు. మానేరు వాగు తీరాన మూడు కిలోమీటర్లు రిటర్నింగ్‌వాల్ నిర్మిస్తూ రోడ్డు వేయాల్సి ఉంది. కానీ స్థానికంగా రాజకీయ ఒత్తిళ్లతో వాగు ఆక్రమణలు, కబ్జాల జోలికి వెళ్లకుండా కాంట్రాక్టర్ మానేరు వాగునే పూడ్చివేస్తూ రోడ్డు ఫార్మేషన్ చేశారు. దీంతో నేరుగా ఉండాల్సిన రోడ్డు వంకర టింకరగా మారింది. ఫలితంగా మానేరు వాగు వెడల్పు తగ్గింది. భవిష్యత్‌లో వరదలు వస్తే కొత్తగా వేసిన రోడ్డు కోతకు గురయ్యే ప్రమాదం ఉంది.

రోడ్డు స్వరూపం ఇదీ..

రోడ్డు వైశాల్యం	: 100 మీటర్లు
రోడ్డు పొడవు	: 3 కిలోమీటర్లు
ఎక్కడి నుంచి ఎక్కడికి	: విద్యానగర్ నుంచి సాయినగర్
రోడ్డు నమూనా	: సెంట్రల్ లైటింగ్, డివైడర్
ప్రత్యేకతలు	: మధ్యలో పూల మొక్కలు, రెండు వైపులా వాకింగ్‌ట్రాక్

హడావుడిగా చేశారు



మానేరు వాగు వెంబడి రోడ్డు పనులు అప్పట్లో హడావుడిగా చేశారు. కానీ చాలా రోజులుగా పనులు ఆగిపోయాయి. ఈ రోడ్డు నిర్మిస్తే అందరికీ సౌకర్యవంతంగా ఉంటుంది. సిరిసిల్లకు కొత్త అందాలు వస్తాయి. వెంటనే మానేరు వెంబడి చేపట్టిన రోడ్డును పూర్తి చేయాలి.

– దండు శ్రీనివాస్, రజక సంఘం సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు

డిజైన్‌ను మార్చాలని ఆపారు



మానేరు తీరంలో రోడ్డు డిజైన్‌ను మార్చాలని పనులు ఆపారు. వరంగల్ భద్రకాళి ఆలయం వద్ద నిర్మించిన తరహాలో రోడ్డు వేయాలని.. అక్కడికెళ్లి పరిశీలించాలని సూచించారు. తొలుత ఈ పనులను మేం పర్యవేక్షించలేదు. డిజైన్ ఖరారు చేసిన మోడల్‌గా ఉండేలా మానేరువాగు తీరాన రోడ్డు నిర్మిస్తున్నాం.

– గంగం శ్రీనివాస్‌రెడ్డి, ఇరిగేషన్‌శాఖ ఈఈ, సిరిసిల్ల

మీ ఓటును చెక్ చేసుకోండి

- అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్



కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల: ప్రతి ఒక్కరూ తమ ఓటు.. ఓటర్ల జాబితాలో ఉన్నదో.. లేదో.. చెక్ చేసుకోవాలని అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యానాయక్ కోరారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఎన్నికల విభాగం అధికారులతో సమీక్షించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో పేరు లేకుంటే.. నమోదు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. అక్టోబరు 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండే వారు ముందుగానే నమోదు చేసుకోవచ్చని వివరించారు. ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులకు సెప్టెంబరు 2, 3వ తేదీల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. బూత్‌లెవల్ అధికారులు(ఎల్ఎల్‌వో) ప్రతి పోలింగ్ కేంద్రంలో అందుబాటులో ఉంటారని స్పష్టం చేశారు. బాధ్యత గల పౌరులుగా పోలింగ్ కేంద్రాల వద్దకు వెళ్లి ఓటర్ల జాబితాను పరిశీలించాలని సూచించారు. ఆన్‌లైన్‌లో ఓటర్స్ హెల్ప్‌లైన్ మొబైల్ యాప్ పేరు చూసుకోవచ్చని తెలిపారు. ఎన్నికల విభాగం డిప్యూటీ తహసీల్దార్ రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

వజ్రోత్సవాల్లో చైర్‌పర్సన్‌లు



సిరిసిల్ల: హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన భారత స్వాతంత్ర్య వజ్రోత్సవాల ముగింపు వేడుకల్లో జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి పాల్గొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పాల్గొన్న ఈ వేడుకలకు జిల్లా నుంచి పలువురు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

నెలలోపే ఇళ్లు మంజూరు

- వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు



ఎమ్మెల్యేను కలిసిన మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

వేములవాడ: వేములవాడకు చెందిన 1200 కుటుంబాలకు ఈ నెలలోనే ఇళ్లు మంజూరు ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే రమేశ్‌బాబు పేర్కొన్నారు. వేములవాడలోని తన నివాసంలో ఆర్డీవో మధుసూదన్, తహసీల్దార్ మహేశ్, మున్సిపల్ కమిషనర్ అన్వేశ్‌లతో సమావేశమయ్యారు. రమేశ్‌బాబు మాట్లాడుతూ 1200 మంది లబ్ధిదారులకు మంజూరుచేసే గృహలక్ష్మి ఇళ్లపై అధికారులతో సమాలోచనలు చేశారు. సొంత జాగా ఉన్న వారికి గృహలక్ష్మి పథకం కింద రూ. 3 లక్షల కేటాయిస్తామనీ, జాగ లేని వారికి 75 గజాల జాగా కేటాయించి రూ.5.30 లక్షలతో ఇంటి నిర్మాణం, బస్ డిపో వద్ద నిర్మాణంలో ఉన్న 144 ఇళ్ల కేటాయింపుపై చర్చించారు. ఈనెల మొదటి వారంలోనే లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలని ఆదేశించారు. డబుల్ బెడ్‌రూమ్స్ ఇన్‌చార్జి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ రంగ వ్యవహారాల ప్రధాన సలహాదారుగా నియమితులైన రమేశ్‌బాబును జగిత్యాల జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత–సురేష్ దంపతులు శుభాకాంక్షలు తెలిపి, శాలువాతో సన్మానించారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్‌లోని అన్ని విభాగాల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులు ఎమ్మెల్యే రమేశ్‌బాబుకు వినతిపత్రం అందించారు.

విధుల్లో చేరిన 'సెస్' ఎండీ సూర్యచంద్రరావు



సిరిసిల్ల: సహకార విద్యుత్ సరఫరా సంఘం(సెస్) మేనేజింగ్ డైరెక్టర్‌గా సూర్యచంద్రరావు శుక్రవారం విధుల్లో చేరారు. రెండున్నర ఏళ్లుగా సిరిసిల్ల 'సెస్' ఎండీగా పనిచేసిన రామకృష్ణ తన మాతృసంస్థ అయిన ఎన్‌పీడీసీఎల్‌కు చీఫ్ ఇంజినీర్‌గా బదిలీ అయ్యారు. సహకారశాఖలో హైదరాబాద్‌లో పనిచేస్తున్న సూర్యచంద్రరావును ఇటీవల 'సెస్' ఎండీగా నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు ఆయన శుక్రవారం విధుల్లో చేరారు. 'సెస్' చైర్మన్ చిక్కాల రామారావును మర్యాదపూర్వకంగా కలిసి బాధ్యతలు స్వీకరించారు. 'సెస్' ఉద్యోగులు విధుల్లో చేరిన మేనేజింగ్ డైరెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

దివ్యాంగులకు అన్ని వసతులు

- టెస్కాబ్ చైర్మన్ రవీందర్‌రావు



దివ్యాంగులకు ఉపకరణాలు అందిస్తున్న టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు

సిరిసిల్లఎడ్యుకేషన్: దివ్యాంగులకు అండగా ఉండి అన్ని వసతులు ప్రభుత్వ పక్షాన కల్పిస్తున్నట్లు టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు పేర్కొన్నారు. స్థానిక ఓ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం సమగ్ర శిక్ష రాజన్నసిరిసిల్ల, ఆలింకో ఆధ్వర్యంలో దివ్యాంగ పిల్లలకు కావలసిన ఉపకరణాలు పంపిణీ చేశారు. రవీందర్‌రావు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం దివ్యాంగుల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. అవసరమైన వారికి వీల్‌చైర్స్, ట్రై సైకిల్స్, వినికిడి యంత్రాలు, రోలేటర్స్, చంక కర్రలు, కాలిపర్స్ తదితర పరికరాలను 141 మందికి అందించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, డీఈవో రమేశ్‌కుమార్, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ విద్యాసాగర్, వార్డు కౌన్సిలర్ కల్లూరి రాజు, గ్రంథాలయసంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, ఎంఈవో దూస రఘుపతి, జిల్లా సైన్స్ అధికారి పాముల దేవయ్య, ఆలింకో ప్రతినిధులు, ఐఈఆర్పీలు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పక్కదారి

- సిరిసిల్ల చిన్నబోనాలలో రేషన్ డీలర్ అక్రమం
- షాపులోకి రాకుండానే పక్కదారి పట్టించిన వైనం
- నామినేటెడ్ పోస్టు నాయకుడిపై విమర్శలు
- షాప్ సీజ్ చేసిన డీఎస్‌వో జితేందర్‌రెడ్డి



పీడీఎస్ బియ్యాన్ని లారీలోంచి ట్రాక్టర్‌లోకి ఎక్కిస్తున్న దృశ్యం

సిరిసిల్లటౌన్/సిరిసిల్లఅర్బన్/సిరిసిల్లక్రైం: అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధి అనే ధీమా కాబోలు బహిరంగంగానే రేషన్ బియ్యాన్ని పక్కదారి పట్టించి బుక్కయ్యాడు. నాలుగు రోజుల క్రితం నామినేట్ పోస్టు వరించగా.. గురువారం సదరు వ్యక్తికి సంబంధించిన రేషన్ దుకాణాన్ని సీజ్ చేసిన సంఘటన సిరిసిల్లలో వైరల్‌గా మారింది. స్థానికులు, డీఎస్‌వో రణధీర్‌రెడ్డి తెలిపిన వివరాలు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చిన్నబోనాలలో రేషన్‌షాపు నంబర్ 3908047కు గురువారం సాయంత్రం లారీలో బియ్యం వచ్చాయి. వచ్చిన రేషన్ బియ్యాన్ని దుకాణం సమీపంలోనే నడిరోడ్డుపై లారీలో నుంచి ట్రాక్టర్‌లోకి మార్చేసి పక్కదారి పట్టించాడు. ఈ తతంగాన్ని స్థానికులు ఫొటోలు తీసి సివిల్ సప్లయ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. సదరు దుకాణాన్ని నాలుగు రోజుల క్రితం సిరిసిల్ల ఏఎంసీలో కీలక పదవి చేపట్టిన నాయకుడు నిర్వహిస్తున్నాడు.

16 క్వింటాళ్ల బియ్యం పక్కదారి

జిల్లా పౌర సరఫరాల అధికారి జితేందర్‌రెడ్డి నేతృత్వంలో డిప్యూటీ తహసీల్దార్లు నవీన్, రవీంద్రాచారి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సంతోష్ దుకాణాన్ని తనిఖీ చేశారు. స్టాక్ బుక్‌లో క్వాంటిటీకి, దుకాణంలో ఉన్న సరుకుకు 16.50 క్వింటాళ్లు తక్కువగా ఉన్నట్లు గుర్తించి దుకాణాన్ని సీజ్ చేశారు. ప్రజాపంపిణీకి ఇబ్బంది కాకుండా సమీప డీలర్ రెడ్డిమల్ల హన్మాండ్లకు తాత్కాలిక బాధ్యతలు అప్పగించినట్లు డీఎస్‌వో జితేందర్‌రెడ్డి తెలిపారు. సదరు రేషన్ దుకాణాన్ని మహిళా సంఘం పేరిట నిర్వహిస్తున్నారని అధికారులు చెబుతుండగా.. రేషన్‌షాపు డీలర్‌గా బండారి శారద పేరిట ప్రజల వద్ద రేషన్ కార్డులు ఉండటం గమనార్హం. డీలర్‌పై 6ఏ సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

జీవనజ్యోతి.. ఆస్తులు జాస్తి!

- ఉమ్మడి జిల్లా మహిళా సమాఖ్య ప్రాపర్టీ విలువ రూ.60 కోట్లు
- వాటా క్లెయిమ్ చేసుకోని పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల సమాఖ్యలు
- పేరుకుపోయిన రూ.2 కోట్ల ఆస్తి పన్ను
- నోటీసులు జారీచేసిన ఐటీ శాఖ
- ఆగస్టు 31తో ముగిసిన గడువు



సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని మహిళా సమాఖ్యకు సంబంధించి ఓ ఆసక్తికర విషయం ఇపుడు తెరమీదకు వచ్చింది. ఉమ్మడి జిల్లా మహిళా సమాఖ్యకు సంబంధించి ఇంకా కొన్నిఆస్తులు విభజనకు నోచుకోలేదని, వాటి విలువ దాదాపు రూ.60 కోట్ల వరకు ఉంటుందన్నది దాని సారాంశం. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. పాత మహిళా సమాఖ్య ఆస్తులకు సంబంధించి దాదాపు రూ.2 కోట్ల ఆస్తి పన్నులు కట్టాలంటూ ఇటీవల ఐటీశాఖ నుంచి నోటీసులు వచ్చాయి. ఆగస్టు 31లోగా మొత్తాన్ని చెల్లించాలని గడువు కూడా విధించినట్లు సమాచారం. అది కట్టని పక్షంలో రూ.1.80 లక్షల చొప్పున జరిమానా కూడా చెల్లించాలని నోటీసుల్లో పేర్కొన్నట్లు తెలిసింది. దీంతో ఉమ్మడి సమాఖ్యకు సంబంధించిన అవిభాజ్య ఆస్తులపై మరోసారి చర్చ మొదలైంది.

రెండు దశాబ్దాల కింద మొదలై..!

2000వ దశకం ఆరంభంలో గ్రామీణ మహిళల్లో పేదరిక నిర్మూలన కోసం స్వయం సహాయక సంఘాల(సెల్ఫ్ హెల్ప్ గ్రూపు/ఎస్‌హెచ్‌జీ)ను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ప్రతీగ్రామంలో 10 నుంచి 15 మంది మహిళలతో ఒక స్వయం సహాయ సంఘం ఏర్పాటు చేశారు. ఇలాంటి 20 నుంచి 30 గ్రూపులను కలిపి గ్రామైక్య సంఘం లేదా విలేజ్ ఆర్గనైజేషన్ /వీవోగా పిలుస్తారు. వీటికి ప్రతినిధులుగా విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్లు ఉంటారు. వీవోలను కలిపి మండల స్థాయిలో మండల మహిళా సమాఖ్య, వీటిని కలిపి జిల్లాస్థాయిలో జిల్లా సమాఖ్యగా పిలుస్తారు. ఉమ్మడి జిల్లాలో అప్పటి జిల్లా సమాఖ్యను జీవన జ్యోతి పేరుతో పిలిచేవారు. ఇవన్నీ సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ(ఎస్ఈఆర్‌పీ లేదా సెర్ప్)కు అనుబంధంగా పనిచేస్తాయి. అప్పట్లో ఉమ్మడి రాష్ట్రంలోని సమాఖ్యలో కరీంనగర్ సమాఖ్య కూడా ఆర్థికంగా బలంగా ఉండేది. మొదట్లో ఈ సమాఖ్యకు ఆర్థికంగా ప్రభుత్వం కూడా చేయూతనందించింది. ఇందుకోసం ఆరంభంలో కొంత గ్రాంటు ఇచ్చింది. తరువాత ఐకేపీ సెంటర్ల ద్వారా సేకరించిన ధాన్యం నుంచి క్వింటాలుకు రూ.32 కమీషన్ ఇచ్చేవారు. ఈ కమీషన్ పాత జిల్లా సమాఖ్య నుంచి మండల సమాఖ్య ద్వారా గ్రామైక్య సంఘాలకు చేరాలి. అదేవిధంగా కొందరు ప్రభుత్వశాఖలకు చెందిన ఉద్యోగులకు సైతం జిల్లా సమాఖ్య బ్యాంకు ఖాతా ద్వారా పంపిణీ చేసేవారు. అందుకు కూడా జిల్లా సమాఖ్యకు కమీషన్ సమకూరేది. అదేవిధంగా తిమ్మాపూర్ మండలంలో భారీగా గిడ్డంగులను నిర్మించి వాటిని సివిల్ సప్లై శాఖకు అద్దెకు ఇచ్చారు. వాటినుంచి నెలానెలా రూ.లక్షల్లో కిరాయి సమకూరుతోంది. క్రమంగా వీరి లావాదేవీలు పెరిగి లాభాలు మొదలవడంతో ఆదాయపు పన్ను శాఖ పరిధిలోకి వచ్చాయని అప్పట్లో ఆడిటర్ సూచించారు. దీంతో అప్పటి నుంచి పన్ను కూడా చెల్లించారని తెలిసింది. అయితే 2015–2016 సంవత్సరంలో ఆడిటింగ్ జరగలేదని సమాచారం.

విడిపోయాక పంపకాలు జరగలేదా?

2016 అక్టోబరులోనే పాత కరీంనగర్ జిల్లా కరీంనగర్, సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల అనే నాలుగు కొత్త జిల్లాలుగా విడిపోయింది. అదే సమయంలో ×జీవన జ్యోతి×గా ఉన్న ఉమ్మడి జిల్లా సమాఖ్య దాని ఖాతాలు, ఆస్తులు, వాటి నిర్వహణ అలాగే కొనసాగుతోంది. అది అలా ఉండగానే కొత్త జిల్లా ఏర్పడిన నేపథ్యంలో ×శ్రీ సీతారామ జిల్లా సమాఖ్య× ఆవిర్భవించింది. ఇదేబాటలో కొత్త జిల్లాలైన సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి కూడా తమ కొత్త సమాఖ్యలు ఏర్పాటు చేసుకున్నాయి. ధాన్యం సేకరణ పెరగడంతో అవికూడా ఆర్థికంగా సుస్థిరత సాధించుకుంటున్నాయి. అయితే, జిల్లాల విభజన జరిగి ఏడేళ్లు కావస్తుండటంతో పాత సమాఖ్య సంగతి దాదాపుగా అంతా మర్చిపోయారు. ఉమ్మడి జిల్లా సమాఖ్యకు సంబంధించిన నగదు, స్థిర ఆస్తుల విలువ రూ.60 కోట్లపైమాటే ఉంటుంది. అయితే, పాత జిల్లా సమాఖ్య జీవనజ్యోతిలో తమ వాటా తేల్చాలంటూ ఇప్పటివరకూ సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల సమాఖ్యల నుంచి ఎలాంటి వినతులు రాకపోవడం విడ్డూరంగా ఉంది. రూ.60కోట్ల ఆస్తుల్లో సమానంగా పంచుకుంటు ఎంతలేదన్నా.. జిల్లాకు రూ.15 కోట్లకు తక్కువ కాకుండా పంపకాలు జరగాలి. అలాంటి ప్రతిపాదన రాకపోవడం, పంపకాలు కాకపోవడం గమనార్హం. అయితే, ఇపుడు ఉమ్మడి జిల్లా సమాఖ్య ఖాతా ఎవరి అధీనంలో ఉంది? దాన్ని ఎవరు నిర్వహిస్తున్నారు? దానికి వస్తున్న బ్యాలెన్స్‌షీట్ ఎవరు చూస్తున్నారు? తదితర ప్రశ్నలకు డీఆర్‌డీవో అధికారులనే సమాధానాలు చెప్పాలి.

మాకెలాంటి సమాచారం లేదు

ఉమ్మడి కరీంనగర్ మహిళా సమాఖ్య ఆస్తుల పంపకంపై మాకు సమచారం లేదు. ఇప్పటివరకూ మా వాటా కావాలని లేదా తేల్చాలని కొత్త జిల్లాల సమాఖ్య నుంచి ఎలాంటి వినతి, ప్రతిపాదనలు రాలేదు. అదే సమయంలో ఉమ్మడి సమాఖ్య ఆస్తులు పంపకం చేపట్టాలని హైదరాబాద్, సెర్ప్ ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు లేవు.

– శ్రీలత, డీఆర్‌డీవో, కరీంనగర్

క్లుప్తంగా

ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలి

- అడిషనల్ కలెక్టర్ ఖిమ్యానాయక్‌కు వినతి



సిరిసిల్లటౌన్: నేషనల్ హెల్త్‌మిషన్ స్కీంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సర్వీసులు క్రమబద్ధీకరించాలని కోరారు. ఈమేరకు ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కడారి రాములు ఆధ్వర్యంలో శుక్రవారం అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు వినతిపత్రం అందించారు. ఖీమ్యానాయక్ మాట్లాడుతూ ఏళ్ల తరబడిగా వెట్టిచాకిరీకి గురవుతున్న ఎన్‌హెచ్‌ఎం స్కీమ్ వర్కర్లు ఉద్యోగాలు ప్రభుత్వం క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఈమేరకు ఆగస్టు 31 నుంచి నిరవధిక సమ్మె చేపడుతున్నారన్నారు. ప్రభుత్వంస్పందించి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. శనివారం నుంచి ఆందోళనలు ఉధృతం చేస్తున్నట్లు వెల్లడించారు.

యువత మేల్కొనాలి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): సిరిసిల్ల నియోజకవర్గంలో యువత మేల్కొనాలని నియోజకవర్గ ఇన్‌చార్జి కె.కె.మహేందర్‌రెడ్డి కోరారు. మండలంలోని పదిర బస్టాండ్‌లో యువకులతో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో యువతకు కాంగ్రెస్ పార్టీ పెద్దపీట వేస్తుందన్నారు. ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలను ఎదిరించాలని కోరారు. యువత చదువుకుంటున్న సమయంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ లేకుండా చేస్తుందన్నారు. పదో తరగతి వరకు విద్యార్థులకు ఉపకారవేతనాలు ఇవ్వడం లేదన్నారు. జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు షేక్ గౌస్, నాయకులు దొమ్మాటి నర్సయ్య, చెన్ని బాబు, చెరుకు ఎల్లయ్య పాల్గొన్నారు.

సీపీఎస్ మాకొద్దు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని కోరుతూ మండలంలోని వెంకటాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించిన ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఉపాధ్యాయ సంఘం నాయకులు చేరాల తిరుపతి, గన్నమనేని శ్రీనివాసరావు మాట్లాడారు. భవిష్యత్తుకు భద్రత లేని సీపీఎస్‌ను వెంటనే రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని కోరారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలకు ముందే సీపీఎస్ సమస్య పరిష్కరించాలని కోరారు. హెచ్‌ఎంలు గొట్టెముక్కల శేఖర్, రవికుమార్, రిసోర్స్‌పర్సన్స్ లింగాల రాజు, ఆడెపు గణేశ్, బి.వసంత్, మంద పద్మలత పాల్గొన్నారు.

లింగన్నపేట కవికి జాతీయస్థాయి పురస్కారం

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని లింగన్నపేటకు చెందిన కవి తంగళ్లపల్లి ప్రభాకర్ జాతీయస్థాయి పురస్కారానికి ఎంపికయ్యారు. ఆర్యాణి సకల కళావేదిక, గౌతమేశ్వర సాహితీ కళా సేవాసంస్థ సంయుక్తంగా ఆగస్టు 28న వాట్సాప్ వేదికగా ఒక గంట వ్యవధిలో రెండు కవితలను అప్పటికప్పుడు రాసే పోటీని నిర్వహించాయి. కవితాంశాలను రెండు నిమిషాల ముందు ప్రకటించి వాటిపై రెండు కవితలు రాయాలని పోటీ నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రభాకర్ జాతీయస్థాయిలో సాహితీ అవార్డు పురస్కారానికి ఎంపికయ్యారు. ఈనెల 10న కరీంనగర్ ఫిలింభవన్‌లో పురస్కారం అందజేయనున్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని బొప్పాపూర్ శివారులో ఎల్లమ్మ గుడి వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఒకరిని తనిఖీ చేయగా.. 130 గ్రాముల గంజాయి లభించినట్లు సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రమాకాంత్ తెలిపారు. తిమ్మాపూర్‌కు చెందిన మహమ్మద్ సమీర్ హైదరాబాద్‌లో చదువుకుంటూ గంజాయికి బానిసయ్యాడు. ఈక్రమంలోనే అక్కడ కొనుగోలు చేసిన గంజాయిలోని కొంత భాగాన్ని బొప్పాపూర్ శివారులో శుక్రవారం విక్రయించేందుకు రాగా.. పోలీసులు అరెస్టు చేశారు. గంజాయిని సీజ్ చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

వాణిజ్య బ్యాంక్‌లకు దీటుగా సహకార బ్యాంక్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉండేలా వాణిజ్య బ్యాంక్‌లకు దీటుగా సహకారబ్యాంక్‌ను ఆధునిక వసతులతో ఏర్పాటు చేసినట్లు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేటలో నూతనంగా నిర్మించిన బ్యాంక్ భవన సముదాయాన్ని త్వరలో మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించనున్న నేపథ్యంలో శుక్రవారం ఆగయ్య పరిశీలించారు. జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, ఏఎంసీ చైర్మన్ ఎలుసాని మోహన్‌కుమార్, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, నాయకులు నర్సింలు, శ్రీనివాస్, శివరామకృష్ణ, కళ్యాణ్, బ్యాంక్ మేనేజర్ సంపూర్ణ పాల్గొన్నారు.







రాజన్నకు మొక్కులు

వేములవాడ: రాజన్నను శుక్రవారం 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. భక్తుల ద్వారా రూ.20 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. అనుబంధ మహాలక్ష్మీ ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ–రాఘవరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి స్వామిని దర్శించుకున్నారు.

'జిందం' హల్‌చల్

- నూలు పౌర్ణమి వేడుకల్లో బూతులు
- నూలు పౌర్ణమి ఫ్లెక్సీల తొలగింపు

సిరిసిల్ల: సిరిసిల్లలో గురువారం జరిగిన నూలు పౌర్ణమి వేడుకల్లో బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు, సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త జిందం చక్రపాణి బూతపురాణం అందుకోవడం శుక్రవారం చర్చనీయాంశమైంది. ఏటా మాదిరిగానే నూలు పౌర్ణమి వేడుకల్లో భాగంగా శోభాయాత్ర తీశారు. ఈ ఏడాది సిరిసిల్ల పద్మశాలి సంఘం, హిందూ సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. సిరిసిల్ల పాత బస్టాండులోని నేతన్న విగ్రహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి పూలమాల వేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి బాధ్యతా యుతమైన హోదాలో ఉండి ‘అరేయ్ మైక్ బంద్ చేయండి’ అంటూ బూతులు అందుకున్నారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. జిందం చక్రపాణి బూతులు తిడుతూ.. చిందులు వేయడాన్ని బీజేపీ నాయకులు ఖండించారు. ఆర్‌ఎంపీ అసోసియేషన్ ప్రతినిధులు సోషల్ మీడియా వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. నూలుపౌర్ణమి సందర్భంగా పట్టణంలో హిందూ సాంస్కృతిక సమితి కట్టిన ఫ్లెక్సీలను తెల్లారేలోగా మున్సిపల్ సిబ్బంది తొలగించడం చర్చనీయాంశమైంది. గతంలో ‘సెస్’ చైర్మన్ చిక్కాల రామారావు చేసిన ‘పద్మశాలి ఓట్ల’ వ్యాఖ్యలను సైతం జోడిస్తూ వీడియోను వైరల్ చేస్తున్నారు.



మాట్లాడుతున్న నాగుల శ్రీనివాస్

పద్మశాలీల ఐక్యత దెబ్బతీసేలా కుట్రలు

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలో అతిపెద్ద సామాజికవర్గం పద్మశాలీలను విచ్ఛిన్నం చేసేలా అధికార బీఆర్‌ఎస్ పార్టీ చర్యలున్నాయని బీజేపీ పట్టణాధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ విమర్శించారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. గురువారం పద్మశాలి సామాజిక వర్గానికి ప్రీతికరమైన నూలు పౌర్ణమి సందర్భంగా వేడుకలను కులపెద్దలు హిందూ సాంస్కృతిక సమితికి అప్పగించారని తెలిపారు. ఈక్రమంలో బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి పద్మశాలీలను కించపరుస్తూ.. నేతన్న విగ్రహం సాక్షిగా బూతులు తిట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేతన్న విగ్రహం సాక్షిగా బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు క్షమాపణలు చెప్పాలని కోరారు. సమావేశంలో నాయకులు శ్రీగాధ మైసయ్య, మ్యాన రాంప్రసాద్, ఎనగంటి నరేశ్, కొండ నరేశ్, సదానందం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇండియా కూటమితో బీజేపీకి భయం

- అందుకే జమిలి అంటూ కొత్తరాగం
- పొత్తులు ఎలా ఉన్నా ఎన్నికలకు సీపీఐ శ్రేణులు సిద్ధం కావాలి
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి

కరీంనగర్: దేశానికి బీజేపీ పాలన నుంచి విముక్తి చేయడానికి ఇండియా కూటమి ఏర్పడిందని, అప్పటి నుంచి బీజేపీకి ఓటమి భయం పట్టుకుందని, అందుకే జమిలి ఎన్నికలంటూ కొత్తరాగం పాడుతోందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం అధ్యక్షతన జరిగిన కరీంనగర్, పెద్దపల్లి, సిద్దిపేట, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, హనుమకొండ జిల్లాలోని ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాలకు చెందిన సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుల సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. తొమ్మిదేళ్లుగా దేశంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో దేశంలో అస్థిరత ఏర్పడిందని అన్నారు. బీజేపీని గద్దెదించేందుకు దేశవ్యాప్తంగా ఉన్న మెజార్టీ ప్రతిపక్షాలన్నీ కలిసి ఇండియా కూటమి ఏర్పడిందని అన్నారు. దీంతో బీజేపీకి వణుకు పుట్టిందని, జమిలి ఎన్నికలు జరపాలని కొత్తరాగం తీయడం దానికి మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవిద్ ఆధ్వర్యంలో కమిటీ వేయడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. రాష్ట్రంలో బీజేపీని నిలువరించడానికి మునుగోడులో బీఆర్‌ఎస్‌కు మద్దతు ఇచ్చామని, ఈ మద్దతు ఇలాగే కొనసాగిస్తామని బహిరంగ సభలో స్వయంగా సీఎం కేసీఆర్ చెప్పి ఇప్పుడు మాట మార్చాడని, మిత్రధర్మం మరిచాడని, అంతర్గతంగా బీజేపీతో దగ్గరవుతున్నాడని అనుమానం కలుగుతోందని అన్నారు. జాతీయ పార్టీ సూచన మేరకు రాష్ట్రంలో కాంగ్రెస్‌తో సంప్రదింపులు జరుగుతున్నాయని తెలిపారు. ఈనెల 11 నుంచి 17వరకు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలు రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరపాలని సూచించారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేన శంకర్, వివిధ జిల్లాల సీపీఐ కార్యదర్శులు మర్రి వెంకటస్వామి, మంద పవన్, కర్రె భిక్షపతి, తాండ్ర సదానందం, గుంటి వేణు, వెన్న సురేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పోనగంటి కేదారి తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారం నిందితులను శిక్షించాలి

- తీవ్రమైన రక్తస్రావంతోనే బాలిక మృతి
- ఎలుకల మందు తాగిందని నమ్మించే ప్రయత్నం
- మావోయిస్టు జేఎండబ్ల్యూపీ డివిజన్ కమిటీ కార్యదర్శి వెంకటేశ్

సాక్షి,పెద్దపల్లి: వలసకూలీపై అత్యాచారం చేసి మృతికి కారణమైన హంతకులను కఠినంగా శిక్షించాలని భారతకమ్యూనిటీ పార్టీ(మావోయిస్టు) జయశంకర్, మహబూబాబాద్, వరంగల్–2, పెద్దపల్లి(జెఎండబ్ల్యూపీ) డివిజన్ కమిటీ కార్యదర్శి వెంకటేశ్ పేర్కొన్నారు. ఈమేరకు శుక్రవారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో పీడిత ప్రజలకు రక్షణలేకుండా పోయిందన్నారు. మధ్యప్రదేశ్‌కు చెందిన వలస కూలీలు పొట్ట కూటికోసం పెద్దపల్లి జిల్లా అప్పన్నపేటకు చెందిన రియల్ ఎస్టేట్ వెంచర్‌లో భవన కూలీలుగా పనిచేస్తున్నారని, వలసకూలీలతో ఒప్పందం చేసుకుని దళారులు ఇటుకబట్టీల్లో పనిచేస్తున్నారన్నారు. వీరిపై గతంలో అత్యాచారాలు జరిగాయన్నారు. రియల్ ఎస్టేట్ వెంచర్‌లో పనిచేస్తున్న బాలికను ఒక వ్యక్తి తన ఇంటిలో పనిఉందని మేస్త్రీకి చెప్పి తీసుకెళ్లి మరోముగ్గురితో కలిసి నోటిలో గుడ్డలు కుక్కి సామూహిక అత్యాచారం చేసి పెద్దపల్లి బస్టాండ్‌లో వదిలివెళ్లారన్నారు. అప్పన్నపేటకు చెందిన వారు గుర్తించి రియల్ ఎస్టేట్ వద్దకు తీసుకెళ్లి అక్కాబావలకు అప్పగించారని, ఈవిషయాన్ని మేస్త్రీకి చెప్పగా ఎక్కడైనా చెబితే చంపేస్తామని భయభ్రాంతులకు గురిచేశారన్నారు. తీవ్రరక్తస్రావమైనప్పటికీ పోలీసులకు సమాచారం ఇవ్వకుండా వాళ్లను బెదిరించి వాహనంలో ఎక్కించి మధ్యప్రదేశ్‌కు తరలించారన్నారు. ఈ క్రమంలో మార్గమధ్యంలో మరణించిందన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు, పోలీసులు యాజమాన్యానికి అండగా ఉండటంతో ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నారన్నారు.

వేలాది సీసీ కెమెరాలు

తెలంగాణలో ఏ చిన్న ఘటన జరిగినా వెంటనే తెలిసేలా వేలాది సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారని, సాధారణ వ్యక్తులు ఏం చేసినా అవి రికార్డు అవుతాయని, అదే పోలీసులు, అధికారులు, యంత్రాంగం, రాజకీయనాయకులు ఏంచేసినా అవి రికార్డు కావన్నారు. బాలికను బస్టాండ్‌లో పడేసిన సీసీ కెమెరాల్లో రికార్డు కాలేదన్నారు. ఘటనను పక్కదారి పట్టించేందుకు అత్యాచారం చేసిన బాధితులు, మేస్త్రీ కూలీ కుటుంబాన్ని బెదిరించి మధ్యప్రదేశ్‌కు తరలిస్తుండగా తీవ్ర రక్తస్రావంతో బాలిక మార్గమధ్యంలో చనిపోయింది కానీ.. ఎలుకల మందు తాగి మృతి చెందిందని నమ్మించాలని చూస్తున్నారన్నారు. ప్రభుత్వమే బాధ్యత వహించి ఘటనకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు రోడ్డు భద్రతపై తరగతులు

ఎస్పీ అఖిల్ మహాజన్



విద్యార్థులు రోడ్డు భద్రతపై మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లక్రైం: రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు శిక్షణనివ్వనున్నట్లు ఎస్పీ అఖిల్‌మహాజన్ పేర్కొన్నారు. రోడ్డు సేఫ్టీ ఎడ్యుకేషన్ క్లాసెస్ (ఆర్‌ఎస్‌ఈ)లో భాగంగా సిరిసిల్లలోని శ్రీకృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ట్రాఫిక్‌రూల్స్, ట్రాఫిక్ సిగ్నల్స్, సైన్‌బోర్డ్స్, మోటార్ వెహికిల్ యాక్ట్‌ గురించి వివరించారు. అనంతరం విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలపై పరీక్ష నిర్వహించి ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఏఎస్పీ చంద్రయ్య, సీఐ ఉపేందర్, ట్రాఫిక్ ఎస్సై రాజు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో మోసగాడు !

సిరిసిల్లక్రైం: వేయి మంది నుంచి కోటి రూపాయల వరకు వసూలు చేసి, కుచ్చుటోపి పెట్టిన మోసగాడు జిల్లా పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. రాజన్నసిరిసిల్ల జిల్లాతోపాటు జగిత్యాల, కరీంనగర్, మంచిర్యాల జిల్లాలో ఉజ్వల త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ కంపెనీ పేరిట అమాయకుల నుంచి రూ.కోటి వరకు వరకు దండుకున్నట్లు సమచారం. దీనిపై కొద్ది రోజులుగా దర్యాప్తు చేస్తున్న పోలీసులు సదరు మోసగాడిని అదుపులోకి తీసుకున్నట్లు ప్రచారంలో ఉంది.

12, 15, 20 తేదీల్లో సదరం శిబిరాలు

- ఆస్పత్రి పర్యవేక్షకుడు మురళీధర్‌రావు

సిరిసిల్ల: జిల్లా కేంద్రంలోని జిల్లా ఆస్పత్రిలో ఈనెల 12, 15, 20 తేదీల్లో సదరం శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఆస్పత్రి పర్యవేక్షకులు డాక్టర్ మురళీధర్‌రావు శుక్రవారం తెలిపారు. 12న మానసిక దివ్యాంగుల శిబిరం, 14న ఆర్థోపెడిక్, 20న వినికిడి సమస్యలతో బాధపడే వారికి వైకల్య నిర్ధారణ పరీక్షలు నిర్వహించనున్నట్లు వివరించారు. జిల్లాలో సదరం శిబిరాలకు వచ్చే వారు మీసేవ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. పాస్‌పోర్టు సైజ్ ఫొటో, మెడికల్ డాక్యుమెంట్లు, ఎక్స్‌రే, ఫోన్‌నంబరు, ఆధార్‌కార్డు వెంట తీసుకు రావాలని సూచించారు.

పేదల సంక్షేమమే బీఆర్‌ఎస్ ధ్యేయం

ఇల్లంతకుంట(మానకొండూరు): పేదల సంక్షేమమే బీఆర్‌ఎస్ ధ్యేయమని జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు పేర్కొన్నారు. మండలంలోని దాచారంలో బీఆర్‌ఎస్ బూత్ ఇన్‌చార్జీలతో సమావేశమయ్యారు. వేణు మాట్లాడుతూ తొమ్మిదేళ్లలో సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేదలకు అండగా నిలిచారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించిన విషయాన్ని గుర్తు చేశారు. మానకొండూర్ ఎమ్మెల్యేగా రసమయి బాలకిషన్ మూడోసారి కూడా భారీ మెజరిటీతో గెలుస్తారన్నారు. చల్ల నారాయణ, తూటి పర్శరాం, సర్పంచ్ పొన్నం పర్శరాం, ఎంపీటీసీ బర్ల తిరుపతి, ఉపసర్పంచ్ వాడే సుమతికాంతారెడ్డి, బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు కుడుముల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు మెరుగైన సేవలు



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు ఎల్లారెడ్డిపేటలో సెస్ సబ్ డివిజన్ కార్యాలయాన్ని మంత్రి కేటీఆర్ చేతులమీదుగా త్వరలోనే ప్రారంభించనున్నట్లు సెస్ చైర్మన్ చిక్కాల రామారావు పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట సబ్ డివిజన్ కార్యాలయంలో ఏడీ, ఏఈ, ఏవోలతోపాటు సెస్ సిబ్బంది వినియోగదాలకు అందుబాటులో ఉంటారన్నారు. ఎల్లారెడ్డిపేట సబ్ డివిజన్ కార్యాలయంలో వీర్నపల్లి, గంభీరావుపేట మండలాల సేవాకేంద్రాలు పనిచేస్తాయని తెలిపారు. ఈమేరకు కార్యాలయం పనులను శుక్రవారం పరిశీలించారు. అందే సుభాష్, పార్టీ పట్టణాధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి, ఎలగందుల నరసింహులు, గంట వెంకటేశ్‌గౌడ్ ఉన్నారు.

ఆంధ్రాలో దొరికారు..!

- పోలీసుల అదుపులో చందన ఆమె బాయ్‌ఫ్రెండ్ కూడా..
- దీప్తి అనుమానాస్పద మృతి కేసులో ప్రగతి

కోరుట్ల: సంచలనం రేపిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ బంక దీప్తి(24) అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన సంఘటనలో నిందితులుగా భావిస్తున్న బంక చందన(21), ఆమె బాయ్‌ఫ్రెండ్‌ను పోలీసులు శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా పరిసరాల్లో తలదాచుకున్న వీరిద్దరినీ పోలీసులు పట్టుకుని కోరుట్లకు తరలిస్తున్నట్లు తెలిసింది.

మూడు రోజులుగా గాలింపు..!

- పట్టణానికి చెందిన బంక దీప్తి మంగళవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం విదితమే.
- అప్పటినుంచి ఆమె చెల్లెలు చందన పరారీలో ఉండటం కలకలం రేపిన క్రమంలో పోలీసులు ఈ కేసును చాలెంజ్‌గా తీసుకున్నారు.
- అక్క దీప్తి చనిపోవడంలో తన ప్రమేయం లేదని చందన తన తమ్ముడు సాయికి వాయిస్ మేసేజ్ పంపిన క్రమంలో ఆమె సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు.
- బుధ, గురువారాల్లో మెట్‌పల్లి డీఎస్పీ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో రెండు పోలీసు బృందాలు చందన ఆచూకీ కోసం హైదరాబాద్‌లో గాలించాయి.
- అక్కడ నుంచి చందన, ఆమె బాయ్‌ఫ్రెండ్ మకాం మార్చినట్లు గుర్తించినట్లు తెలిసింది. చందనతోపాటు ఆమె బాయ్‌ఫ్రెండ్‌కు పాస్‌పోర్టులు ఉండటం వారు రూ.2 లక్షల నగదు, సుమారు రూ.90 లక్షల విలువైన బంగారం ఇంటి నుంచి తీసుకెళ్లారని తండ్రి శ్రీనివాస్‌రెడ్డి చేసిన ఫిర్యాదుతో ఆ డబ్బుతో వారిద్దరూ విదేశాలకు పారిపోయే అవకాశం ఉందన్న అనుమానంతో పోలీసులు లుక్ అవుట్ నోటీసులు జారీచేశారు.

హైదరాబాద్– బెంగళూర్ మార్గంలో.. ఆంధ్రాలో

బంక చందన బంధువులు ఒంగోలు జిల్లాకు చెందిన వారు కావడంతో ఆంధ్రప్రదేశ్‌కు ఆమె వెళ్లి ఉంటుందని భావించిన పోలీసులు ఆ దిశలో గాలింపు చేపట్టారు. హైదరాబాద్ నుంచి బెంగళూర్ మార్గంలో అనంతపురం, ప్రకాశం జిల్లా పరిసరాల్లో చందన ఆమె బాయ్‌ఫ్రెండ్ ఉన్నట్లుగా గురువారం రాత్రి పోలీసులు గుర్తించారు. శుక్రవారం తెల్లవారుజామున చందన ఆంధ్రాలోని ప్రకాశం జిల్లా పరిసరాల్లో ఉన్నట్లుగా గుర్తించి పకడ్బందీ ప్రణాళికతో అక్కడికి చేరుకుని వారిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. శుక్రవారం రాత్రి వారిద్దరినీ కోరుట్లకు తీసుకువచ్చినట్లుగా తెలుస్తోంది. పోలీసుల అదుపులో ఉన్న చందన, ఆమె బాయ్‌ఫ్రెండ్‌లు వాస్తవాలు వెల్లడిస్తే దీప్తి అనుమానాస్పద మృతి వెనుక అసలు నిజాలు వెలుగులోకి వస్తాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వీరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు శనివారం విచారణ చేయనున్నట్లు సమాచారం.

అక్కాచెల్లెళ్లకు యావజ్జీవం

- చెల్లితో కలిసి భర్తను హత్య చేసిన భార్య
- మృతదేహానికి బండకట్టి బావిలో పడేసిన వైనం

కోరుట్ల/జగిత్యాలక్రైం: ఆస్తి పంచి ఇవ్వడం లేదన్న నెపంతో భర్తను హత్య చేసిన భార్యకు, ఆమెకు సహకరించిన చెల్లెలుకు జగిత్యాల సెషన్స్ కోర్టు జడ్జి నీలిమ శుక్రవారం యావజ్జీవ శిక్ష, రూ. 6వేల జరిమానా విధించినట్లు కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. 2018 మార్చి 3వ తేదీన కోరుట్ల మండలం సంగెం గ్రామానికి చెందిన గుంటి గంగమల్లయ్య(52) తన రెండో భార్య గుంటి దేవ(35)తో కలిసి పొలం వద్దకు వెళ్లి సాయంత్రం వరకూ రాలేదు. దీంతో అనుమానించి అతడి మొదటి భార్య కుమారుడు గుంటి మహేందర్ అప్పటి సీఐ సతీశ్‌చందర్‌రావుకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించిన సీఐ.. మృతుడి రెండోభార్య గుంటి దేవతోపాటు కల్వకోటకు చెందిన ఆమె చెల్లెలు ఆదె రజితను నిందితులుగా గుర్తించారు. అనంతరం వారిని విచారించగా గుంటి దేవ తన చెల్లెలు రజితతో కలిసి పొలం పనుల ముగిసిన తర్వాత భర్త గుంటి గంగమల్లయ్యపై వెనుక నుంచి దాడి చేసి కత్తితో మెడ కోసి హత్య చేసినట్లు తేలింది. హత్య చేసిన తర్వాత గంగమల్లయ్య మృతదేహం నడుముకు చీరతో బండ కట్టి వ్యవసాయ బావిలో పడేశారు. ఆస్తి కోసమే హత్య చేసినట్లు ధ్రువీకరించిన అప్పటి కోరుట్ల సీఐ సతీశ్‌చందర్‌రావు.. 302, 201 రెడ్‌విత్ 34 ఐపీసీ సెక్షన్ల కింద వీరిని అరెస్టు చేయగా జగిత్యాల సెషన్స్ కోర్ట్‌లో విచారణ సాగింది. గుంటి దేవ, రజిత కలిసి గంగమల్లయ్యను హత్య చేసినట్లుగా సీఐ సతీశ్‌చందర్‌రావు, పీపీ మల్లికార్జున్ కోర్టులో సరైన సాక్ష్యాలు ప్రవేశపెట్టారు. దీంతో జగిత్యాల సెషన్స్ కోర్ట్ జడ్జి నీలిమ శుక్రవారం తుది తీర్పు వెలడించారు. సీఐ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ, నిజాలు నిర్భయంగా కోర్టుకు వచ్చి చెపితే నిందితులకు త్వరితగతిన శిక్షలు పడతాయన్నారు.

సమాచారం పొందడం అందరి హక్కు

ఆర్డీవో ఆనంద్‌కుమార్



మాట్లాడుతున్న ఆర్డీవో ఆనంద్‌కుమార్

సిరిసిల్లకల్చరల్: ప్రభుత్వ కార్యాలయాల్లో జరుగుతున్న ప్రతీ పని గురించి సమాచారం పొందడం అందరి హక్కు అని ఆర్డీవో ఆనంద్‌కుమార్ అన్నారు. సిరిసిల్లలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో శుక్రవారం కౌన్సిల్ ఫర్ సిటిజెన్ రైట్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సమాచారహక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్డీవో ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ పది రూపాయల ఖర్చుతో ఎలాంటి సమాచారం పొందడానికైన అవకాశం ఉందన్నారు. ప్రిన్సిపాల్ కనకశ్రీ విజయరఘునందన్ మాట్లాడుతూ సమాజంలో ప్రశాంతమైన పౌరజీవనం కోసం ప్రతి ఒక్కరు సమాచార హక్కు చట్టంపై అవగాహన పెంచుకోవాలన్నారు. అధ్యాపకులు బుర్ర వెంకటేశం, కనకయ్య, సామల వివేకానంద్, చంద్రమౌళి, రాజయ్య, ఆంజనేయులు, లింగం, విజయ, అరుంధతి, చంద్రశేఖర్, గెంట్యాల రాజశేఖర్, మల్లెవేని రవీందర్, శ్రీనివాస్, మహేశ్ పాల్గొన్నారు.

దేశభక్తికి నిరంతరస్ఫూర్తి

విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేందుకు నిరంతరం స్ఫూర్తినిచ్చేందుకే నిత్య జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కనకశ్రీ విజయ రఘునందన్ తెలిపారు. నిత్య జాతీయ పతాకావిష్కరణకు 50వ రోజు నిండిన సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల పూర్వ విద్యార్థి రిటైర్డ్ సైనికుడు అల్లె మహేశ్ మాట్లాడుతూ క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు.

విద్యార్థిని చితకబాదిన టీచర్

సిరిసిల్లక్రైం/సిరిసిల్లఅర్బన్: ఓ టీచర్ విద్యార్థిని చితకబాధగా చేయి విరిగిన సంఘటన సిరిసిల్లలో ఆలస్యంగా వెలుగుచూసింది. బాధితుని తండ్రి మహేందర్ తెలిపిన వివరాలు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని మహాత్మా జ్యోతిబాపూలే హాస్టల్‌లో తంగళ్లపలి మండలం నేరెళ్లకు చెందిన పల్లె విష్ణుతేజ ఐదో తరగతి చదువుతున్నాడు. ఆదివారం టాయిలెట్‌కు వెళ్లగా నీళ్లు లేకపోవడంతో సంపు వద్దకు బకెట్‌తో వెళ్లాడు. గమనించిన టీచర్ విష్ణును కొట్టడంతో చేయికి గట్టిగా తగిలింది. బుధవారం విద్యార్థి తండ్రి మహేందర్ హాస్టల్‌కు వెళ్లాడు. చేతికి వాపు ఉండడాన్ని గమనించి సిరిసిల్లలోని ప్రైవేట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లగా మణికట్టు వద్ద ఎముక పగులుచూపిందని తెలిపి, పట్టి వేశారు.

నేడు కేజీబీవీ ఉద్యోగాల సర్టిఫికెట్ వెరిఫికేషన్

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లాలోని కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు భర్తీ ప్రక్రియలో భాగంగా శనివారం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయనున్నట్లు డీఈవో రమేశ్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. అర్హత పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థుల ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఇంగ్లిష్, ఫిజిక్స్, బయాలజీ సిఆర్టీ పోస్టుల మెరిట్ జాబితా 1:3 జాబితాలో http:ririciadoe.com/downoad /index.php వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలతో శనివారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని డీఈవో ఆఫీస్‌లో హాజరుకావాలని సూచించారు. వివరాలకు 96666 72320, 96429 59599 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.